పెళ్లిచూపులకు వచ్చినవాడు హంతకుడని తెలిసి ఆ తండ్రి ఎందుకు ఒప్పుకున్నాడు?

# నాకు పెళ్లొద్దు

ధనరాజ జ్ఞానేశ్వర్ కథ

ఈ రోజు నాకు తొలిసారిగా పెళ్లిచూపులు జరగబోతున్నాయి.

సాధారణంగా ఆడపిల్లలకి పెళ్లిచూపులవగానే ఏదో తెలియని, అంతదాకా అనుభవంలోకి రాని, ఊహించలేని, వర్ణించలేని ఫీలింగ్ వుంటుందంటారు.

ఇలా అంటున్నానంటే మీరడగొచ్చు "ఏం నీకా ఫీలింగ్ లేదా? అని.

నిశ్చయంగా నిజాయితీగా చెబుతున్నాను "నిజానికి నాకెలాంటి ఫీలింగు లేదు" అని.


"ఎందుకు?" అన్న ప్రశ్న మీ వద్ద రెడగా వుందన్న విషయం నాకు తెలుసు కాబట్టి ఆ ప్రశ్న మీరు వేయకముందే సమాధానం చెప్తాను.

వయసు వసంతంలోకి ప్రవేశిస్తుంటే మనసు ఆమని రాగాలు తీస్తుంటే కోరికలు సప్తవర్ణాలై ఆకాశంలో హరివిల్లై మరిపిస్తుంటే కాబోయే వరుడు వరుడై మదనుడై స్త్రీ అతని వింటి శరమై... శృంగార పట్టమహిషై...

భావం సందిగ్ధంగా వుందనుకుంటూ...

మొత్తానికి ఆడపిల్ల. ఫిజికల్ గా మెచ్యూరైన తరువాత బాగా గుర్తుంచుకోండి. ఫిజికల్ గా మెచ్యూరైన తరువాత మెంటల్ మెచ్యూరిటీతో సంబంధం లేకుండా అలాంటి ఫీలింగ్స్ కి ప్రిఫరెన్స్ ఇవ్వడం జరుగుతుంది. నిజంగా అంతగా ఫీలవ్వాల్సిన విషయం లేదు ఆ విషయంలో.

ఎందుకంటే చాలామంది ఆడపిల్లలు తాము ఊహించుకున్న ఊహలకీ, కన్న కలలకీ, విరుద్ధంగా తమ తమ కాపురాలు వుండడం



తో ఓ రకమైన డిప్రెషన్‌కి లోనుకావడం జరుగుతోంది. అదే ర్రావానూ మెంటల్‌గా మారేలా చేసి, మెకానికల్‌గా తయారయ్యేలా చేస్తోంది.

నిజానికి ఏ జీవితమూ ఊహించుకున్నంత అందంగా వుండదు. అందుకే ఊహలో జీవించడంకంటే వాస్తవంలో బ్రతకడం ఎంతో ఉత్తమం అన్నది నా వ్యక్తిగత

అభి[ప్రాయం.

అసలు విషయానికి రానే లేదు మనం.

ఆడ పిల్లకి పెళ్లిచూపులనగానే వారివారి అంతరంగంలో అందమైన భర్త — ఆదరించే అత్తమామలు, అన్యోన్యమైన దాంపత్యం, సరసోక్తులతో వుడికించే ఆడపడుచులు, వారిమధ్య తన జీవితం, దాంపత్య జీవితానికి [ప్రతీకగా అందమైన పిల్లలు, వారి అల్లరితో పాటు తనని ఆరడిపెట్టే భర్త, వారి బాగోగులకి తను [శమించడం — వారి ఉన్నతికి తాము పాటుపడడం — ఇవేగా భవిష్యదాలోచనలు.

నిజంగా నిజం చెప్పండి!

ఎంతమంది జీవితాలు పైన వివరించిన రీతిలో అందంగా, అద్భుతంగా, ఏ చీకూచి ంతా లేకుండా వుంటున్నాయి?

నూటికో కోటికో ఒక్కరి జీవితం ఆ విధంగా వుంటుందేమోనని నేనంటే అసం బద్ధంగా వుంటుందేమోగానీ — నిజానికి అది నేతి బీరకాయలో నెయ్యి వుండదన్నంత వాస్తవం.

ఆ నూటిలో, కోటిలో నువ్వుండచ్చుగా అనడిగితే — నాకా అదృష్టం లేదని నిశ్చయంగా చెప్పగలను.

కారణం — నేను కురూపిని కాబట్టి

గుడ్డివారిమీద సానుభూతి వుందీ లోకా నికి. కుంటివారిమీద జాలివుందీ [ప్రపంచాని కి. అవిటివారిమీద కరుణ వుందీ సమాజాని కి. కానీ అలా ఏ కోవకీ చెందని నాలాంటివా రికి సానుభూతి, కరుణ, జాలిలాంటివన్నీ అందని [ద్రాక్షపళ్లే.

అందమైన వారికి ఖచ్చితంగా అందమైన వారే కావాలి.

అందంలేని వారికీ పిల్లలైనా అందంగా వుండాలన్న కోరిక కారణంగా వారికీ అంద మైనవారే కావాలి.

అలాగే గుడ్డివారైనా వారు చూడలేకపో యినా సరే అందమైన అమ్మాయే కావాలి. ఎలాంటి అవకరం వున్నవారైనా తమకన్నా అందమైనవార్నే కోరుకుంటారు. కానీ నా లాంటిదాన్ని కాదుగా!

కొండొకచో — ఎవరో ఒకరు నాలాంటి దానిని పెళ్లాడడానికి ఇష్టపడుతున్నారంటే అందుకు కారణం పైన చెప్పిన సానుభూతో , కరుణో, జాలో కారణం కాదు. అందమైన కట్నం కారణం.

మరి మా నాన్న — ఆ అందమైన కట్నం ఇవ్వగలిగినవాడూ కాదు. అదీగాక నన్ను పెళ్లాడడానికి ముందుకు వచ్చే మగాళ్ల కి మరో అదనపు ఆకర్షణ — నా ఉద్యోగం — తద్వారా నెలనెలా వచ్చే జీతం.

ఎవరో కవి అన్నట్టుగా నన్ను నన్నుగా [ప్రేమించని వ్యక్తితో ముందు జీవితాన్ని పంచుకోవడం ఏ రకమైన అనుభూతి నాకు?

అతను [ప్రేమించేది నన్నుకాదు. నాద్వా రా అతను పొందగలిగే ధనాన్ని. ఆ ధనంద్వారా అతను పొందగలిగే సౌకర్యాన్ని, అనుభవించే లగ్జరీ లైఫ్‌ని— అలాంటి మనిషి మీద నాకు ఏరకమైన అభి[ప్రాయం ఏర్పడు తుంది?

ఇద్దరు వ్యాపారస్థులు ఒక బిజినెస్ [ప్రారంభించబోతుంటే ఏర్పరచుకున్న నిబ ంధనలకీ, పెళ్లి పేరుతో నా జీవితాన్ని

పంచుకోబోయే వ్యక్తితో జీవితానికీ, కట్టుబాట్లకీ తేడా లేదు.

అలాంటప్పుడు నా 'అనుభూతి'కి అర్థం ఏమిటి?

అయినా టీనేజ్ దాటి, ఆరేళ్లయింది — బాధ్యతల బరువుతో నా భుజాలు కిందికి వంగాయి. శరీరంలో వున్న ఆ కాస్త ఆకర్షణ తగ్గి, వికారమైన అందం భయపెడుతుంది. మొహంలో నూత్న యవ్వనం మాయమై ఆ స్థానే ముదురుతనం గోచరించసాగింది.

ఇప్పుడు నాకు మిగిలింది అనుభూతి కాదు. అనుమానం — ఆకర్షణ కాదు— వారికి నేను నచ్చుతానో లేదోనన్న భయం.

ఇవి నా వ్యక్తిగత కారణాలు కాగా, ఇవన్నీ నా జీవితానికి వున్న రెండు వైపులకీ— ఒకవైపు మాత్రమే.

మరోవైపు నేను పుట్టిపెరిగిన వాతావరణం, పరిస్థితులు, సమాజ స్థితి ఇవన్నీ వున్నాయి.

మా తల్లిదండ్రుల కాలానికి, నా కాలానికి మధ్య చాలా మార్పులొచ్చాయి.


శతాబ్దాల చరిత్రలో పాతిక సంవత్సరాల సమయం చాలా చిన్న విషయమే కావచ్చుగానీ, ఆ కాలాన్ని మనుషులకు అన్వయిస్తే, అది సుదీర్ఘమైన సమయం క్రిందే లెక్క.

మా అమ్మ పెళ్లి జరగడానికి మానాన్నకు, మా తాతయ్య ఇచ్చిన కట్నం కేవలం నూట పదార్లు.

ఆ కట్నం డబ్బుతో ఇప్పుడు ఓ పెద్ద కుటుంబం ఓ పూట సుష్టుగా భోంచేస్తుందేమో.

కానీ ఇప్పుడు ఎందుకు పనికిరానివాడు కూడా 'ల'కారాలు, వాహనాలు, అవకాశం దొరికితే ఇంటికి కావలసిన సామాను — అంతా మామగారి దగ్గరనుండే లాగాలని చూస్తున్నాడు. ఇంత కోరుతున్న అతనికి వున్న విలువేమిటి? అని అడిగితే — అతడి నెత్తిన రూపాయి బిళ్లపెట్టి అమ్మడానికి

## మొక్కలకూ స్టిరాయిడ్‌లు



క్రీడారంగంలో 'స్టిరాయిడ్'ల వాడకాన్ని నిషేధించారు. అయినా కొందరు అధికార్లను మోసం చేస్తూ వీటిని వాడుతూ 'మెడల్స్' తెచ్చుకుంటూనే వున్నారు. అయితే కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చెప్తున్నదాన్నిబట్టి క్రీడాకారులే కాదు — మొక్కలకూ స్టిరాయిడ్‌లువాడి — వాటి పెరుగుదలకు 30 శాతందాకా పెంచవచ్చునంటున్నారు. ఇప్పటికే వరి, గోధుమల మీద చేసిన పరిశోధనలు ఫలించడంతో ఈ 'సరికొత్త స్టెరాయిడ్'లను వ్యాపార సరళిలో ఉత్పత్తి చేయడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి!

— జూపిటర్

పెడితే అర్థరూపాయి విలువ చెయ్యదు.

చదువు వుండదు. ఉద్యోగం వుండదు. స్వయంగా ఏదైనా ఉపాధి ద్వారా తనను, తన భార్యను పోషించుకునే ఆత్మస్థైర్యం సైతమూ వుండదు.

వున్నదంతా 'మగాడు' అన్న ఒక్క అర్హత.

ఇంతమాత్రానికే — అతనికి అంత గొప్ప ప్రాధాన్యత ఎందుకో అర్థంకాదు నాకు.

"అమ్మాయి... ఇంకా తయారవలేదా?–" హడావుడిగా వచ్చింది అమ్మ.

నా ఆలోచనల దారం పుటుక్కున తెగింది. తేరుకుని అమ్మవంక చూశాను.

ఏమనుకుందోగాని, దగ్గరగా వచ్చి 'ఏమిటీ ఆ పిచ్చి చూపు. నా తల్లివిగా త్వరగా లేచి తయారవు అబ్బాయి వచ్చే వేళయ్యింది. వారొచ్చాక ఆలస్యం చేస్తే బావుండదు" అని లాలనగా అంది.

ఆ మాటల్లో వున్న చల్లదనమో, లాలిత్యమోగాని, ఏడుపు ఉప్పెనలా పొంగింది నాలో.

"అమ్మా..." వాటేసుకుని వలవలా ఏడ్చేశాను ఇక ఆగలేనట్టుగా.

కలవరపడింది అమ్మ. "ఎందుకే. ఏమయిందే. మీ నాన్నా గానీ ఏమైనా అన్నాడా?" అంటూ కంగారుపడింది.

"అమ్మా" నాకు నాకూ... " మిగతా మాటల్ని అనడానికి వెక్కిళ్లు అడ్డుతగిలాయి

"నీకు ఏమయింది చెప్పు... ఏమయింది" ఆదుర్దాగా అడిగింది.

ఏం చెప్పాలో తోచలేదు నాకు. "నాకేమయింది? ఏమీ కాలేదు. పెళ్లిచూపులంటే నాకే ఫీలింగూ లేదు. ఏమయిందని చెప్పాలి?" ఏడుపు ఓ ప్రక్క ఆలోచనలు ఓ ప్రక్క మధ్య నేను సతమతమవుతున్నాను.

"చెప్పమ్మా! నీకేమయింది?" తిరిగి నన్ను బుజ్జగించింది అమ్మ.

ఆ కొద్దిపాటి సమయంలో తేరుకుని, ఆమెనుండి దూరంగా జరిగి, కళ్లు తుడుచుకుంటూ "ఏం లేదమ్మా... ఎందుకో ఏడ్పు వచ్చింది" అన్నాను. కొంగు చివరతో కళ్లు అద్దుకుంటూ.

తేలిగ్గా నవ్వి "అంతేనా! క్షణంలో ఎంత కంగారుపెట్టావే తల్లీ" అని "లే... లేచి మొహం శుభ్రంగా కడుక్కో! అలా ఏడిస్తే కళ్లు ఎర్రబడతాయి అందంగా కనిపించవు" అని వెళ్లిపోయింది.

"అందం... వుంటేగా కనిపించడానికి" అనుకున్నాను విరాశగా నవ్వేఫ

అనుకున్న సమయానికి రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు పెళ్లివారు నన్ను చూడడానికి.

అంతదాకా అమ్మకూ, నాన్నకూ ఒకటే టెన్షన్. "వస్తారా? రారా? మనసుగానీ మార్చుకున్నారా? రావలసిన బస్ ఇంకా రాలేదా?" ఇలా ఏవేవో ఊహించుకుని తమలో తాము మదనపడసాగారు.

నాకు ఆసక్తి లేదు. అనాసక్తీ లేదు.

అమ్మ బలవంతంమీద ఆమెకు వచ్చిన రీతిలో అలంకరించుకున్నాను. నాన్న బజారునుండి స్వీట్లు, కొన్ని పండ్లు తీసుకురావడంతో వాటిని ప్లేటులో సర్దుతూ వున్నాను.

వారు వచ్చాక తెలిసింది దార్లో బస్ ఫెయిలయిందని, మరో బస్‌లో రావడానికి ఆలస్యమైందనీనూ.

నాన్న అప్పటికిగానీ కుదుటపడలేదు.

వారంతా హాల్లో కూర్చున్న తరువాత నన్ను రమ్మనమని పిలుపు వచ్చింది.

వెళ్లేముందు ఆఖరిసారిగా అద్దంలో ఓసారి చూసుకున్నాను. క్షణంలో వెయ్యోవంతు త్రుళ్లిపడ్డాను.

అద్దంలో వున్నది నా ప్రతిబింబమేనా? అన్నంత అనుమానం కలిగింది నాకు.


నుదట ఎర్రగా, అందంగా, గుండ్రంగా వున్న తిలకం ఉదయించే సూర్యుణ్ణి జ్ఞప్తికి తెస్తోంది. నల్లటి తలలో తెల్లని మల్లెలు ఆకాశంలో నక్షత్రాలకు మల్లే గోచరిస్తున్నాయి. బయటకు పొడుచుకువచ్చి, అందవికారంగా కనిపించే పళ్లు సైతం ఆ క్షణం అందంగా కనిపిస్తున్నాయి.

నాలో కూడా ఏదో మూల కొద్దిగా అందం వుందన్న నమ్మకం తొలిసారిగా కలిగిన క్షణం అది.

ఆ నమ్మకం నాకు కొంత ధైర్యాన్ని, మరికొంత ఆత్మవిశ్వాసాన్ని కలిగించడంతో, కాస్త హుందాగా వెనక్కి వంగి నడవబోయాను. అలా నడవడంలో నా ఎద కాస్త ముందుకు పొడుచుకువచ్చినట్టుగా అనిపించింది. "నాలోనూ స్త్రీత్వం వుందన్నమాట" చిన్నగా నవ్వొచ్చిందినాకు.

వెనక నాతోపాటు వస్తున్న మా అమ్మ, దానిని సిగ్గుగా రిసీవ్ చేసుకుంటే అది నా తప్పుకాదు.

అక్కడ కూర్చోవడం, వచ్చినవారికి టిఫిన్లు అందించడం, టీలు అందించడం, అడిగినవాటికి వినయంగా, నమ్రతగా, స్థిరంగా సమాధానాలు చెప్పడంతో ఆ తతంగం అరగంటపాటు సాగాక నన్ను లోపలికి వెళ్లమని చెప్పడంతో నా పాత్ర నాటకంలో ముగిసినట్టుగా ముగిసింది.



వారు ఏ విషయం వారంలోగా తెలియజే స్తామని చెప్పి, వెళ్లబోతుండగా కిటికీదగ్గర కాబోయే పెళ్లికొడుకుని చూడడానికి ప్రయత్నించాను. వాన్న దగ్గర ఏదో మాట్లాడుతూ కనిపించాడతను. వారికి నేను కనిపించే అవకాశం లేకపోవడంతో ధైర్యంగా, తదేకంగా అతనివి చూశాను.

మనిషి బాగానే వున్నాడుగానీ, వయసే కాస్త పైబడినట్టుగా చెంపలదగ్గర వెంట్రుకలు తెల్లబడినట్టుగా వున్నాయి.

అయినా ఫరవాలేదు. అమ్మా నాన్నలకు భారం కాకుండా, ఎవరితోనో ఒకరితో నా జీవితం ముడిపడితే చాలు.

వివాహంపట్ల నాకేం పెద్దగా ఆశలు లేవు నిరాశ చెందడానికి.

ఈ పెళ్లి కేవలం మా అమ్మా నాన్నలని సంతృప్తి పరచడానికి తప్ప మరెందుకూ కాదు.

□ ■ □

మర్నాడు యధావిధిగా, యాంత్రికంగా ఆఫీసుకు బయలుదేరాను.

ఆఫీసులో అడుగుపెట్టగానే సుశీల వచ్చి అడిగింది — "పెళ్లిచూపులు బాగా జరిగాయా" అని.

ఏ మాత్రం సిగ్గుపడకుండా "బాగానే జరిగాయి" చెప్పాను నేను.

"ఏమన్నారు వారు..." ఆరాగా అడిగింది.

"ఎవరేమంటే ఎందుకో? అవతలవారి మీద అనవసరమైన ఈ క్యూరియాసిటీ ఈ మనుషుల్లో ఎప్పటికి అంతరించేనో.

"వారం తరువాత తెలియజేస్తామన్నారు' చెప్పాను నేను సహనాన్ని కూడగట్టుకుని.

"కట్నం ఎంతలో అడిగారు?" మరో ప్రశ్న.

"ప్లీజ్ నన్నొంటరిగా వదిలేస్తావా? మొన్న వదలిన వర్క్ కంప్లీట్ చేయాలి!" వీలైనంతవరకు కంట్రోల్ చేసుకుంటూ సౌమ్యంగానే చెప్పాను.

ఏమనుకుందో — అదోరకంగ నావంక చూస్తూ తన సీట్లోకి వెళ్లిపోయింది.

నా పనిలో నిమగ్నమవుతుండగా, అటెండర్ వచ్చి — "మేడం! సార్ ఈ ఫైల్ మీకిమ్మన్నారు" అంటూ ఓ ఫైల్ నా టేబిల్ముందుంచాడు.

"వుండనీ వెళ్లు!" అంటూ యధాలాపంగా తలతిప్పి చూసి, వ్రాసుకోబోతుండగా పేపర్మీది ఫోటో ఎక్కడో, ఎప్పుడో చూశాననిపించింది.

తల తిప్పి మరోసారి ఆ ఫోటో వంక చూశాను.

నిశ్చయంగా అతన్ని ఎక్కడో చూశాను. ఎక్కడ... ఎక్కడ?

అతను ఎవరితోనో,మాట్లాడుతుండగా చూసిన గుర్తు. చాలా తక్కువ కాలమయింది కూడా...

హఠాత్తుగా గుర్తొచ్చింది — ఆయన నిన్న పెళ్లిచూపుల్లో చూసిన వ్యక్తి.

అతని ఫోటో పేపర్లో ఎందుకొచ్చింది.

గబగబా ఫైలు విప్పి, ఆ పేపర్ని, ఫైలునుండి విడదీసి, పైన డేట్ చూశాను. దాదాపు సంవత్సరం క్రితంది. మనిషి మొహానికి గడ్డం మాస్క్లా వుండడంతో గుర్తించడం కష్టమైంది.

పైన హెడ్డింగ్ చూశాను.

"వరకట్నం కేసులో వ్యక్తి అరెస్ట్" అని వుంది.

గుండె ఝల్లుమంది. దాన్ని చదవగానే. కాళ్లూ, చేతులూ వణకసాగాయి. నాకు తెలీకుండానే, నాకంట్రోల్లో లేకుండానే.

భయంభయంగా చదవసాగాను.

ఏలూరు, నవంబర్ 15: పెళ్లయి ఐదు సంవత్సరాలుకూడా కాకుండానే తెచ్చిన కట్నం చాలలేదన్న మిషతో కట్టుకున్న భార్యను కాల్చి చంపిన ఉదంతమిది. ఏలూరుకి చెందిన సుదర్శనరావు (36) ఐదుసంవత్సరాల క్రితం హైదరాబాద్‌కి చెందిన వనజ (28)ను కట్నకానుకలతో లాంఛనప్రాయంగా, పెద్దల సమక్షంలో అగ్నిసాక్షిగా పెళ్లాడాడు. నాలుగు సంవత్సరాల క్రితందాకా ఎలాంటి విబేధాలు లేకుండా వారి సంసారం కొనసాగింది. ఈమధ్యకాలంలో వ్యసనాలకు బానిసైన సుదర్శనరావు, మామగారిచ్చిన కట్నం చాలలేదని మరికొంత డబ్బు తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. అతని భార్య సంవత్సరకాలంగా అతను పెట్టే బాధలని మౌనంగా భరించింది తప్ప, తల్లిదండ్రులకీ విషయం తెలియజేయలేదు. భర్త వేధింపులకు సహనం చచ్చిపోయిన ఆమె 12వ తేదీ మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో కిరోసిన్ వంటిమీద పోసుకుని నిప్పంటించుకుంది. ఎనభై శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ఆమె తన మరణ వాఙ్మూలంలో తన చావుకు తన భర్తే కారణమన్న విషయాన్ని తెలియజేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదంతా చదివేసరికి నా వంట్లో నీరంతా ఆవిరైనట్టుగా తోచింది. ఓ హంతకుణ్ణా తను వివాహమాడబోతోంది?

అంతకన్నా చావు నయంకదూ?

నేనెంత అనాకారినైనా, చదువుకున్నదాన్ని, ఉద్యోగం చేస్తున్నదాన్ని. నాకు మంచి

## అందం!

ఓ అందగత్తె డాక్టర్ దగ్గరకెళ్లింది.

"డాక్టర్ నా యౌవనం తగ్గిపోకుండా వుండాలంటే ఏం చేయాలి"

"ఆత్మహత్య చేసుకుని ద్రావకంలో నిలబడాలి. వేరేమార్గంలేదు" చెప్పాడు డాక్టర్.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



చెడూ విశ్లేషించుకునే తెలివి వుంది. ఏమీ తెలియని ఆడపిల్లల మాదిరిగా నాన్న మాటకి తలవంచడంవల్ల నాకొరిగేదేమిటి? బ్రతికినంతకాలమూ అతగాడి సాధింపులూ, బెదిరింపులు. వెలవెలా జీతం డబ్బు అతని వ్యసనాలకు ధారపోయడాలు ఇదేగా మిగిలేది.

దానికన్నా పెళ్లి చేసుకోకుండా వుండడం నయంకదూ!

హడావుడిగా — ఓ లీవ్ లెటర్ వ్రాసి, సెక్షన్ ఆఫీసర్‌కి ఇచ్చేసి, ఆ న్యూస్ పేపర్‌తో బయటపడ్డాను.

ఇంటికి వచ్చాకకూడా నాకా విషయంమీద నమ్మకం కుదరక మరోసారి చదివాను. నిన్న నేను పెళ్లిచూపుల్లో చూసింది సుదర్శనరావువేనన్న విషయాన్ని అమ్మనడిగి నిర్ధారించుకున్నాను.

మధ్యాహ్నంగానీ నాన్న రాలేదు.

వచ్చాక — అతనిముందు ఆ పేపర్ని వుంచి చెప్పాను. "మీరు నిన్న చూసిన పెళ్లికొడుకు ఇతనేకదూ!"

"అవునమ్మా..." నాన్న గొంతులో గాంభీర్యం కనిపించింది.

"అతనెలాంటివాడో తెలుసుకున్నారా? తెలియకపోతే ఆ వార్త చదవండి!" అన్నాను.

"ఈ కేసు విషయమా? ఇదంతా నాకు ముందే తెలుసు!"

ఇప్పుడు ఆశ్చర్యపోవడం నా వంతయింది.

"అంటే — తెలిసి తెలిసి ఓ హంతకుడికి నన్ను కట్టబెట్టాలనుకుంటున్నారా నా కన్నతండ్రి?"

అసలు జరిగిందేమంటే మొదటిభార్య ప్రవర్తన మంచిదికాదట. ఈయన లేని సమయంలో పక్కింటి కుర్రాడితో అక్రమ సంబంధం పెట్టుకుందట! అది వద్దన్నందుకు భర్తమీద చస్తూ చస్తూ నేరం మోపి చచ్చిపోయింది''

ఎంత బాగా డ్రామా అల్లాడంటే వింటున్నవారికి సుదర్శనరావుమీద జాలి, చచ్చిపోయిన ననజమీద అసహ్యం పుట్టే కథనం అల్లారు.

చచ్చిపోయినవారెలాంటివారైనా వారికి ఎంతో కొంత మంచితనం ఆపాదించడం మానవత్వం అనిపించుకుంటుందే. ఈ మనుషులెందుకు తమ స్వార్థంకోసం, స్వలాభంకోసం చచ్చిపోయిన మనిషిని కులటగా చిత్రించడానికి వెనుకాడడంలేదు.

"రేపు నన్నూ చంపి అలాగే అంటాడు నాన్నా! నమ్ముతావా నువ్వు?" ఏడుపు తన్నుకొస్తుండగా అన్నాను.

"నిన్నెందుకు చంపుతాడు?" కోపంగా అన్నాడు నాన్న.

"ఒకరిని చంపి తప్పించుకున్నవాడు ఇంకొకరిని చంపడని గ్యారంటీ ఏముంది"

"అతనికదేమైనా వృత్తా?"

"ఎస్. వృత్తే... ఏడాదికో కొత్త పెళ్లాం, కొత్తగా కట్నం, లాంఛనాలు దొరుకుతాయంటే — ఎందుకు ఇది వృత్తి కాకూడదు"

నాన్న నా దగ్గరగా వచ్చి నా తలమీద చేయి వేసి మెల్లగా నిమురుతూ—

"అలా అనకు తల్లీ! చల్లగా నూరేళ్లు బ్రతకాలనే ఏ తండ్రయినా తన కూతురి పెళ్లి జరుపుతాడుగానీ, ఇలా అర్ధాంతరంగా

చావు రావాలనికాదు.

కళ్లలో ఉబుకుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ "నేను మారేళ్ల చల్లగా వుండాలని నువు కోరుకుంటే నాకు పెళ్లి చెయ్యకు నాన్నా! నాకసలు పెళ్లే వద్దు!" నాన్న ఎదమీద వాలిపోయి మరలా ఏడ్చేశాను.

□ ■ □

